# మెతుకులు

అక్కడ గాలిలో సువాసనలు లేవు. అక్కడ నేల పసందుగా అందంగా లేదు. అక్కడ ఎత్తైన మేడలు లేవు. అక్కడ మనుషులు మనుషుల్లా లేరు. అక్కడ బతుకుతున్న బతుకు బతుకులా లేదు.

అక్కడ గాలి దూరంగా ఉన్న పబ్లిక్ పాయిఖానాల వాసనని మోసుకొస్తోంది. అక్కడ నేల బురద బురదగా, మడ్డిగా, అసహ్యంగా తరతరాల మానవ చీకటి చరిత్రకు నిదర్శనంగా ఉంది. అక్కడ గుడిసెలు పుట్టుకతో చతికిల పడిపోయిన పోలియో పిల్లల్లా ఉన్నాయి. అక్కడ మనుషులు వంటి నిండుగా బట్టలేక, కంటి నిండుగా నిద్రలేక, కడుపు నిండుగా తిండిలేక పుచ్చిపోయిన కట్టెకర్రల్లా ఉన్నారు.

ఆ మహాపట్నంలో పెద్ద బజారుకి రెండు కిలోమీటర్ల దూరంలో వూర్లోని చెత్తనంతా ఒక మూల పోసినట్టుగా అసహ్యంగా, అసభ్యంగా, అనాగరికంగా, అస్తవ్యస్తంగా నాగరిక ప్రపంచం చూడ్డానికిష్టపడని ప్రదేశంలాగే ఉంది ఆ ముష్టి వాళ్ళ నివాస స్థలం.

ఇప్పుడు ఆ గుడిసెల ముందర మనుషులెవరూ లేరు. పందులు, గజ్జికుక్కలు గుర్రు పెడుతూ, బురదని నాకుతూ, గుడ్డ పీకల్ని లాక్కుంటూ ఉండుండి అరుస్తున్నాయి. ఆ గుడిసెలకు కొంచెం దూరంలో ఒక పడిపోయిన భవనం ఉంది. అది ఎన్నేళ్ళ నాటిదో, ఏ జమీందారుదో, ఏ రాజుగారి విహార మందిరమో కానీ - ఈనాడు అలనాటి రాజరికపు అహంకారంలాగే, రాసిక్యతలాగే, జారిపోయి, గోడలు కూలిపోయి దిక్కు మాలిన ఒక వ్యవస్థకు సజీవ చిహ్నంలాగే ఉంది. ఆ భవనానికి వెనకపక్క రెండు గోడల మధ్య పైన రేకులు వేయడం వలన అది వో గదిలా ఉంది. ఆ గదిలో ఒక మూల నాలుగు

సత్తు పళ్ళాలు, రెండు ఎండుటాకుల్లా ముడుచుకు పోయిన గ్లాసులు, ఒక చీపురుకట్ట, మురికి మురికి గుడ్డలు, నులక తెగిపోయిన ఒక మంచం, కాళ్ళు విరిగిన కఱ్ఱబల్ల, సగానికి వూడిపోయిన ప్లాస్టిక్ బకెట్ ఉన్నాయి.

ఆగదిలో పై నున్న కఱ్ఱలకి వేలాడదీసిన ఒక ఉయ్యాల ఉంది. చిరిగిపోయిన చీర వుయ్యాలలో చీకూ చింతలూ లేకుండా హాయిగా నిద్రపోతోంది వో పాప. ఆ పాపకు ఆర్నెల్లుంటాయి. ఆ పాప పాపలాగా లేదు. నల్లగా భోగిమంటల్లో పడి సగం కాలిపోయిన ఇత్తడి ముక్కలా ఉంది. సన్నగా కాళ్ళు. మొలకి నల్లటి తాడు, ముఖానికో పెద్ద కుంకుమ బొట్టు. ముడుచుకుపోయిన లేత ఆకుల్లా చేతులు. వేళ్ళను ముడుచుకుని గుండె మీద వేసుకుని నిద్రపోతోంది పాప.

చీర వుయ్యాల వూగుతోంది. వూగుతున్న ఆ వుయ్యాలకు ఎడమ వేపుకి కొంచెం దూరంలో ఒక ఆకారం. ఆ ఆకారం గోడకిచేరబడి కాళ్ళు జాపుకుని గుడిసెల వేపుకి చూస్తూ వుయ్యాల వూపుతోంది. మధ్య మధ్యన లోనికొస్తున్న కుక్కల్ని కసురుతూ బైటకు తరుముతోంది.

వుయ్యాల వూపుతున్నప్పుడు ఆ ఆకారం చేతికున్న మట్టి గాజులు చిన్నగా శబ్దం చేస్తున్నాయి. ఆ చేతులు నల్లగా గొంగళి పురుగుల్లా ఉన్నాయి. వేసుకున్న బూడిద రంగు జాకెట్టుకి ఒక వేపు చెయ్యి వూడిపోయింది. జాకెట్టు వెనక ముందు పెద్ద పెద్ద చిరుగులు. ఎన్నోసార్లు కుట్టినట్లుగా, కుట్టిన అతుకులు కూడా వూడిపోయి వేలాడుతున్నాయి. చాలీచాలని చీర మోకాళ్ళ వరకూ ఉంది. చీర ఒక్కటే ఆమె శరీరాని కున్న ఒకే ఒక్క అచ్ఛాదన. సగానికి సగం చిరిగిపోయిన ఆ చీర శరీరాన్ని కప్పిన సంతృప్తిని మాత్రమే ఆమె కిస్తోంది.

ఆమె ముఖం సన్నగా, కోలగా నొక్కేసిన రేకు డబ్బాలా ఉంది. ఆమె కళ్ళు ఉబ్బిపోయిన కళ్ళలా ఉన్నాయి. ఆ కళ్ళలో చూపులున్నాయి కానీ, ఆ చూపులు నీరసంతో కలిసిపోవడం వల్ల ఆ చూపులు చూపుల్లా లేవు. ఆమె జుత్తు నల్లగా ఉండేదేమో కానీ ఇప్పుడలా లేదు. వుమ్మేసిన కారాకిల్లి ఎండిపోయినపుడు కనిపించే మెరుపుతో, మురికి పట్టి వుంది ఆమె జుట్టు. నిలబడితే ఆమె నల్లరంగు వేసిన రాటలా ఉంటుంది.

సమయం ఎంత అయిందో తెలియదు. వేసవికాలం అవడం వల్ల ఎండ తీక్షణంగా ఉంది. పక్కన సగం నీరెండిన పెద్ద చెరువు మధ్యలో ఉన్న

రాళ్ళమీద రాబందులు కూర్చున్నాయి. ఆ పక్కన స్మశానంలో ఎవరిదో శవం మండుతోంది. ఎముకలు విరుగుతున్న చప్పుడు, కాల్తున్న చర్మం వాసన గాలిలో నిండి గుడిసెల చుట్టూ తిరుగుతోంది.

ఆ గుడిసెలకు ఎడం పక్కనున్న అయిల్‌మిల్లు లోంచి హారన్ పెను కేకలా వినబడింది. ఆశబ్దానికి ఉయ్యాలలోని పిల్ల లేచి ఏడవడం ప్రారంభించింది. ఆ ఏడుపు ఏడుపులాగా లేదు. ఏ బండిచక్రం కిందో కాలుపడి నలిగిపోతే గింజుకునే పంది పిల్ల అరుపులా ఉంది.

గోడకి చేరబడి కళ్ళు మూసుకున్న ఆ తల్లి గబుక్కున కళ్ళు తెరిచింది.

"మూదనష్టపు గుంట లేచి పోనాది.." తనలో తను అనుకొని ఉయ్యాలని ఇంకా గట్టిగా వూపింది. ఆ పిల్ల ఏడుపు మానలేదు. పేగులన్నింటిని కూడతీసుకుని ఏడుస్తోంది. ఆ తల్లి లేచి వుయ్యాలలోని పిల్లని తీసుకుని మళ్ళీ గోడకి చేరబడి కూర్చుంది. ఆ పిల్ల చేతులు పాలకోసం వెతుకున్నాయి.

"పాల్ నేవే .. గుంట నమ్డి" ఆ తల్లి విసుక్కుంది. గుండీలు లేని జాకెట్టుని వూడ తీసుకుంది. ఎండిపోయిన రొమ్ములు తోలుముక్కల్లాగే ఉన్నాయి. ఆ తోలు ముక్కల్లో వో తోలుముక్కని ఆ పిల్ల నోట్లో పెట్టింది ఆ తల్లి. ఆకలి తీరదని తెలీదు, అయినా ఆ పిల్ల ఏడుపు మానేసి చప్పుడు చేస్తూ చీకుతోంది.

పావుగంట గడిచింది. పిల్ల నీరసంతో ముడుచుకు పోయి నిద్రపోయింది. పిల్లదాన్ని మళ్ళీ వుయ్యాలలో పడేసింది తల్లి.

నిలబడి చుట్టూ చూసింది. అప్పుడా తల్లికి కుంటి రావులు కనబడ్డాడు. ఆడు కర్రని వూతగా చేసుకుని, ఒక కాలుని ఎగరేస్తూ నడుస్తూ ఆయాసంతో వచ్చి వో గుడిసె ముందు కూర్చున్నాడు.

"వోరోరి కుంటిగా... తిండి దొరికినాదేట్రా?" ఆడి దగ్గర కెళ్తూ అడిగిందా తల్లి.

"లేదేవ్. తిండి నేకపోతే సచ్చిపోతావేటే, నంజా"

"నా క్కాదరా గుంటలకి" ఆడి దగ్గరున్న చిక్కాం వేపు ఆశగా చూస్తూ అన్నది ఆ తల్లి. కుంటి రావులు చిక్కాంలో చెయ్యి పెట్టి అటు తిప్పి, ఇటు తిప్పి దాన్ని తలకిందులుగా చేసి దులపరించి పదిహేను పైసల్ని కూడదీశాడు. అప్పుడాడు ఆ తల్లి వైపు చూస్తూ ఇలా అన్నాడు.

"సూడే, లచ్మీ! లోకంలో దరమం నా లాగే కుంటిదయిపోనాది. రైలు

టేషన్ కాడ పొద్దు టేల నించి కాపు కాసానా చిక్కిన కానీ డబ్బులియ్యే." అరచేతిలో పదిహేను పైసల్ని చూపిస్తూ అన్నాడు రావులు.

"అయ్యి నాకిచ్చీరా" అడగబోయింది లచ్చి. అడగలేక పోయింది. ఆడివేపు చూస్తూ ఆ పక్కన కూర్చుంది.

"ఏడిగుడ్డిసాదూ గోడు రానేదా?" రావులు అడిగాడు.

"గుడ్డి సాదూ రానేదు. గుంటలూ రానేదు. పైడమ్మతో ఎల్లేరు. గుంటలు ఎక్కడేడుస్తున్నారో ఏటో.."

"గుడ్డి సాదూ వొచ్చినా బావుణ్ను. ఆడి దగ్గర నాలుగు డబ్బులు రాలతాయి. గుడ్డోడు కదా. ఆణ్ణి చూస్తే అందరికీ కనికరం. అందుకే సెప్పాను. పిల్లదాన్ని.." ఆడేదో అనబోయాడు.

లచ్మి అక్కణ్ణించి లేచిపోయింది.

"దిక్కుమాల్న నంజికొడకా! నా గుంటకు ఆ కరమ మేం పట్టదు. నీ రెండు కళ్ళూ కుళ్ళబొడిచేసుకుని అడుక్కోరా" విసురుగా అంటూ వెనక్కొచ్చింది.

కుంటి రావులు నవ్వాడు. ఆడు నవ్వుతుంటే పళ్ళు లేని ఆడి నోరు వికృతంగా తోలు డబ్బాలా ఉంది.

"కుంటోన్నయినా పెపంచకానికి దయనేదు. గుడ్డోన్నైతై కనికరం కారతాదేటే. నీ నాంటి దైతే కబోదినైనా, కుంటి దాయినైనా ఆడదాయివి కాబట్టి ఇంటినిండా కనకవే, లచ్మీ."

"నోరు ముయ్యిరా. కళ్ళుండికూడా గుడ్డిదాన్ని సేసేశావు. నేకపోతే..." లచ్మి కళ్ళు విషాదంగా కుంటి రావులు వేపు చూశాయి. ఆడు దానివేపు చూడడంలేదు. లేచే ప్రయత్నంలో ఉన్నాడు. అప్పుడాడిలా అన్నాడు –

"వూరుకోయ్, పత్తిత్తూ! పెద్ద గుంటడు పకీరుగాడికి బుట్టేడు. రెండో గుంట గుడ్డి సాదూ గోడికి పుట్టింది. సిగురుగుంట నాకు బుట్టిందంటన్నావు. ఎవరికెరిక. నువ్వేం పెంచీయాల. పోషకారం సేసియాల. అందుకే దాన్ని నా కిచ్చీ మంటున్నాను. దాన్ని నా కిచ్చేస్తే పాతిక ... పాతిక రూపాయలిస్తాను. సూసుకో. లచ్మీ. లచ్మిని తన్నీసుకోకు."

కుంటిరావులు కర్రని సర్దుకుని కాలుని ఎగరేసుకుంటూ ఎండన బడ్డాడు.

లచ్మి గోడకి చేరబడి కూర్చుంది.

దూరంగా రైల్వేస్టేషను కెళ్ళే రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడు

కార్లు, లారీలు వేగంగా పోతున్నాయి. లచ్మి ఆశగా చూస్తోంది ఎవరైనా వస్తారని. బయట కెళ్ళిన ఒక్కడూరాలేదు. ఎప్పుడో మొన్న రాత్రి తిన్న రొట్టెముక్క, నిన్నుదయం తాగిన పదిహేను పైసల టీ అంతే.

ఆకలి.

లచ్మి చెయ్యి ఒక్కసారి కడుపు మీదకు వెళ్ళింది. బాధగా ఎడం చేత్తో కడుపునంతా ఒక్కసారి గట్టిగా పట్టి నొక్కుకుంది. వుయ్యాల్లో పిల్లవేపు ఒక్కసారి చూసి, లేచి బైటికొచ్చింది. రైల్వే స్టేషను వేపు నడుస్తోంది.

ఎండ, దేశంలో దరిద్రంలా ఉంది. ఎన్ని పథకాలు ఎన్ని ప్రణాళికలు వేసినా ఏ మాత్రం మార్పులేని 'దిక్కుమాలిన జనం' బతుకుల్లాగే రోడ్డు మీద తారు మరుగుతూంది. కాలు నేల మీద వెయ్యడానికి భయంగా ఉంది. వెచ్చటి గాలి విసురుగా ఉంది. గబగబా నడుచుకుంటూ రైల్వే స్టేషన్ ముందున్న మర్రిచెట్టు ముందుకు నడిచింది లచ్మి.

అక్కడ చల్లగా ఉంది. ఆ చల్లదనం మహానాయకురాలి వాగ్దానాల చలివేంద్రంగా చక్కగా ఉంది. ఆ పక్కన రెండు ఐసు బడ్డీలున్నాయి. ఆ వెనక కిళ్ళీ బడ్డీలు, పళ్ళ దుకాణం. ఒక పక్క ఏవేవో గాజుల దుకాణాలు, రెండో పక్క రైల్వేవాళ్ళ కేంటీను. దూరంగా పాత బస్టాండు. వచ్చీపోయే బస్సుల రొద.

ఐసు బడ్డీ పక్కన నిలబడింది లచ్మి. ఐసు బడ్డీవాడు కాళీగా ఉన్నాడు. వాడు లచ్మి వేపు చూశాడు. ఆ సమయంలో లచ్మి వాడివేపు చూసి నవ్వింది.

"షరబత్తిస్తావా. డబ్బులు రేపిస్తాను." ఆశగా చూస్తూ అడిగింది.

వాడు పలకలేదు.

మళ్ళీ అడిగింది లచ్మి.

"అసలే బేరాల్లేవు. వుల్లా బేరాలైతే నెత్తి మీద కొంగేసుకోడవే. డబ్బుల్తే. ఇస్తాను." చికాగ్గా అన్నాడు వాడు.

"డబ్బుల్లాపే ఇస్తన్నావేటి పైడమ్మకు. దానెత్తు గుండెలు, వయ్యారాలు సూసి ఇస్తన్నావు గానీ." ఉడకుమోత్తనంగా దీర్ఘం తీస్తూ అన్నాది లచ్మి.

"అయ్యే సూసి ఇత్తన్నాను. ఏటంటావేటి."

"ఏసు నీళ్ళన్నా ఇయ్యిరా" గాజు గ్లాసుని ముందుకు తోస్తూ అన్నది లచ్మి.

"అంతగా దాహమేస్తే ఈ నీళ్ళు తాగు. ఏసొకటా" సీసాలోని నీళ్ళను గ్లాసులో పోశాడు. లచ్మి గడగడా తాగేసింది. గ్లాసుని చప్పుడయ్యేటట్టు

పెడుతూ "మగ నా కొడుకులు. దొంగ నాకొడుకులు" వాడికి వినబడేటట్టుగానే అంది. ఆ మగనాకొడుకేం చలించ లేదు. బీడీ తీసుకుని వెలిగించుకునే ప్రయత్నంలో వాడు వోరగా దాని పిరుదుల వేపు చూస్తున్నాడు.

ఎక్కువవుతున్న ఎండలాగే ఉంది ఆకలి. సన్నగా ప్రారంభమై ఎముక ముక్కని కొరికే కుక్క పళ్ళ శబ్దంలా కరకర మంటూ కడుపులో నరాల మంట. అటూ ఇటూ చూస్తూ గుడిసెల వేపు వస్తోంది లచ్మి.

దూరంగా సినిమా థియేటర్ దగ్గర టిక్కెట్ల కోసం జనం కుమ్ములాడుకుంటున్నారు. ఆ పక్క ప్రభుత్వ సారాదుకాణం లోంచి బయటి కొచ్చిన ఒక బారతీయ పౌరుడు ఏడుస్తున్నాడో, పాడుతున్నాడో తెలీకుండా అరుస్తున్నాడు.

రోడ్డుకి రెండు వేపులా అంతెత్తు పెంటకుప్పలు. ఆ పక్కన కాలువ వారన వరసగా

కుక్కపిల్లలు పొర్లుతున్నాయి.

లచ్మి అప్పుడు అటు వేపు చూసింది. కాలవకి పెంట కుప్పలకు మధ్యన కుళ్ళిపోయిన బత్తాయి పళ్ళు. జోరుగా అటు నడిచింది. వంగోని, మరీ పనికిరాని పళ్ళు వదిలేసి, సగం కుళ్ళిపోయిన నాలుగు పళ్ళని ఏరింది.

ఒక పక్కంతా పూర్తిగా కుళ్ళిపోయి, వాటి తొక్క నల్లగా ఉంది. వాటిని చేతుల్లోకి తీసుకుని చిరిగిపోయిన పైటతో వాటికి అంటుకున్న బురదని, మట్టిని తుడిచింది. ముక్కు దగ్గర పెట్టుకుని వాసన చూసింది. చచ్చిపోయిన నల్లుల వాసన. వాటిని పైటలో దాచుకుని గబగబా గుడిసెల వేపొచ్చింది లచ్మి.

చుట్టూ చూసింది.

గుడిసెలదగ్గరకి యింకా ఎవరూ రాలేదు. ఉయ్యాల్లో పిల్లవేపు చూసింది. అదింకా కునుకుతూంది. సత్తు గ్లాసులో నీళ్ళు తీసి ఆ బత్తాయి పళ్లని కడిగింది. ఒకదాన్ని నోట్లో పెట్టుకుంది. అసహ్యంగా ఉంది వాసన. ఆకలి వాసనను లెక్కచెయ్యదు. రెండో పక్క నుంచి కుళ్ళిపోయిన తొనల్ని తింటోంది .

సరిగ్గా -

ఆ సమయంలో వచ్చాడు పెద్ద గుంటడు. లచ్మి పెద్ద కొడుకు వాడు. వాడికో పదేళ్ళుంటాయి. వాడి జుత్తు చిందర వందరగా ఉంది. వాడిచేతులు పొట్టిగా ఉన్నాయి. వాడి ముక్కు వలంగా ఉంది. వాడి కళ్ళు చిన్నవిగా

ఉన్నాయి. వాడి గుండె ఆర్చుకుపోయి, ఎండిపోయిన మావిడిబద్దలా ఉంది. వాడి వళ్ళు నల్లగా ఉంది. వాడు ఉదయంనించి ఎండలో తిరగడం వలన నల్లటి వంటి మీద చెమట దట్టంగా జిగట కారుతూ ఉంది. వాడి మొలకో చిరిగిపోయిన నిక్కరు దేశంలో ప్రజాస్వామ్యంలా జారిపోతోంది. ఆ నిక్కరును నిలబెడుతున్న మొలతాడు మేధావిలా ఉంది.

ఆడు గబగబా తల్లి దగ్గర కొచ్చాడు. ఆడెనకాల ఆడి చెల్లి ఎనిమిదేళ్ళది వచ్చింది. అదీ ఆడిలాగే ఉంది. కానీ దాని కాళ్ళకు ఆరేసి వేళ్ళున్నాయి. దాన్నెవరైనా చీకట్లో చూస్తే జడుపుతో జ్వరం పెట్టుకుంటారు.

పెద్దగుంటడు అనబడే లచ్చిమ కొడుకు తల్లి దగ్గరి కొచ్చి తల్లి చేతుల్లో ఉన్న బత్తాయి పండుని లాక్కొని ఆబగా తింటూ ఇలా అన్నాడు –

"వోలమ్మా! వోలమ్మా ఆ నంజి కూతురు సూడే. నా కన్నం దొరికితే దొబ్బేసినాది. నానూ, అప్పల కొండ ఎళ్ళినావ్ బాపన వీధిలోకి, అక్క డన్నం ఏరినావ్. నానూ, సెల్లీ ఇంటికి తెద్దావని మూట కట్టినానే. ఇంతలో ఆ నంజి కూతురు ఆ పైడి నంజి కూతురు ఎక్కణ్ణుంచొచ్చిందో .... గబుక్కున సెల్లి సేతుల్లోంచి దొబ్బుకు పోనాది. నా నాడ్చేను కానీ, తోసేసినాదే. లగెత్తేసినాదే నంజ. రానేదేటే." పెద్ద గుంటడు చాలా ఆయాసంతో కళ్ళూ కాళ్ళూ ఎగరేస్తూ అక్కడ పైడి అనబడే పైడమ్మ వాళ్ళిద్దరి చేతుల్లోంచి ఎలా అన్నం పొట్లం లాగేసుకుందో చెప్పి సత్తు గ్లాసులోని నీళ్ళు గబగబా తాగుతున్నాడు. వాడి చేతిలో గ్లాసుని లాక్కుని అప్పలకొండకూడా తాగి -

"ఆకలేత్తందమ్మా." అని ఆ పక్కనున్న బత్తాయి పళ్ళు చూసి ఓటి తీసుకుంది.

"అయితే పొద్దుటేల నించీ ఏవీ తిన్నేదట్రా. అస్సలేవీ దొరకనేదా ఎక్కడా?" లచ్చిమి అడిగింది కొడుకునీ, కూతుర్నీ.

"తిండి దొరుకుద్ది గదాని ఆ యీదిలోనే ఉండిపోనాం."

"ఒక్క కాడే సచ్చడవేట్రా. దాన్నక్క డుంచి నువ్వు బొంకుల దిబ్బకాడ కెళితే కాన్డబ్బు లొచ్చును గదరా." కోపంగా అంది లచ్చిమి.

వాళ్ళు మాట్లాడలేదు.

పెద్ద కొడుకు వేపు, కూతురు వేపు చూసి విలవిల్లాడింది లచ్చిమి. అప్పుడామె తన ఆకలి మరచిపోయింది. పిల్లలు కడుపారా తిండి తిని ఎన్నాళ్ళయిందో. తల్లీ పిల్లలూ బజార్లో కెళ్ళి అడుక్కున్నా కడుపులు

నిండడం లేదు. కన్నందుకు వాళ్ళ ఆకల్ని తనెలా తీర్చగలదు. అడుక్కోవడంలోనూ పోటీలే.

లచ్చిమి వాళ్ళిద్దరి వేపూ ఒకసారి చూసింది. ఇద్దరి తలా నిమిరి వళ్ళో పడుకో బెట్టుకుంది. చెంపలూ, ముఖం నిమిరి -

"ఒక్క సిటం వోపిక పట్టండి. గుడ్డి సాదూ గాడైనా, కుంటిరావులుగాడైనా, పకీరుగాడైనా వస్తారు. ఏదైనా తెస్తారు. అడిగిస్తాను. కుసింత కునుకు తియ్యండి'' వోదార్చింది.

పిల్లలు పలకలేదు.

ఎండ తిరిగి తగ్గుముఖం పట్టింది. రోడ్డు మీద మనుషులు తిరగడం మొదలైంది. చాలాసేపు రోడ్డు వేపు చూస్తూ కూర్చుంది లచ్చిమి.

ఇంతట్లో గుడ్డి సాదువు, పకీరుగాడూ ఒక్కసారే వచ్చారు. పకీరుగాడు గుడ్డి సాదువు కర్రని పట్టుకుని ముందున నడుస్తున్నాడు. ఇద్దరూ వాళ్ళ గుడిసె దగ్గర కొచ్చారు. వాళ్ళు రావడంతోనే లచ్చిమి లేచి, పడుకున్న పిల్లల తలల్ని ఒడిలోంచి తీసి నేలమీద పెట్టి వాళ్ళ గుడిసెవేపు వెళ్ళింది.

"పిల్లలు ఆకలితో సొమ్మసిల్లి పోనారు. ఏదైనా ఉంటే ఇయ్యండ్రా'' దీనంగా అడిగింది.

"ఏముంది. ఏవీనేదు మా కాడ. వూరంతా తిరిగితే రూపాయి డబ్బులు దక్కనేదు. ఒట్టు'' ..... పకీరుగాడు లచ్చిమి అడిగిందానికి జవాబుగా అన్నాడు.

"నేదే, లచ్చిమీ. ఏవీనేదు. గుంటలు పై కెళ్ళినారు గావాల. ఏవీ తేనేదా.'' గుడ్డి సాదువు అడిగాడు.

"నేదు. వన్నం దొరికినాదట గానీ, ఆ దరిద్రపు పైడినంజ నాక్కుందట'' అని గుడ్డి సాదువు చిరుగు సంచీ వేపు చూసింది. అందులో పైకి కనబడుతున్న రొట్టె ముక్క వేపు ఆశగా చూసింది. గబుక్కున వంగొని సంచిలోది లాక్కుంది. ఒక్క క్షణంలో తన గుడిసెవేపు పరుగెత్తింది.

"ఏటది. ఏటది.'' గుడ్డి సాదువు అరిచాడు.

"దొంగ నంజ... రొట్టె లాక్కుందిరా'' పకీరుగాడు విసురుగా లేచాడు. లచ్చిమి వెనకాతల పరుగెత్తాడు. లచ్చిమి గబగబా పరెగెత్తుతూనే రొట్టె పైన ఉన్న ముచ్చు కాగితాన్ని చింపి, రొట్టెని నోట్లో పెట్టుకుని కొరికింది. దానెనకాతల పకీరుగాడు పరుగెత్తి కెళ్ళి చెయ్యి పట్టుకున్నాడు.

"తిండి నేదురా. ఇయ్యిరా. ఉన్నియ్యిరా.'' పిడికిట్లో గట్టిగా రొట్టెను పట్టుకుని అంది లచ్చిమి.

"మాకూ తిండి నేదే" విసురుగా దాన్ని లాక్కోబోయాడు పకీరు. లచ్మి వెనక్కి దాచేసింది. దాని ఎడం చేతిని గట్టిగా పట్టుకుని కుడి చేతిలోని రొట్టెను లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడు పకీరు. రొట్టెను గట్టిగా పట్టి, ఆణ్ణి గట్టిగా ముందుకి తోసేసింది లచ్మి. పకీరుగాడు ముందుకు పడబోయి నిలదొక్కుకుని గట్టిగా దాని మొఖమ్మీద గుద్దాడు. అయినా లచ్మి పట్టు వదలలేదు. వాడు ఆ పెనుగులాటలో లచ్మి గుండెమీద చెయ్యి వేసి గట్టిగా ముందుకి తొయ్యబోయాడు.

అప్పుడు లచ్మి –

"ఒరేయ్ పకీరు! ఆడి వేపు సూడు. దానేపు సూడు, తిండి లేక సొమ్మసిల్లి పోనారు. ఆ లెవఁర్లా. నా పిల్లలు. ఆడేపు సూడు. ఆ పెద్ద గుంటడు. ఆడు ఆకలో ఆకలో అని అరిచి పడిపోనాడు. ఆడెవఁడ్రా. నీకు బుట్టినోడు కాడూ. ఒరే పకీరుగా, ఆడి కెట్టడానికేరా. నాక్కాదురా. ఇయ్యరా" మీద మీదకొస్తున్న ఆడితో తల్లిగా దయనీయంగా అడిగింది లచ్మి. ఆ మాటలు వాడి మీద ఏ మాత్రం పనిచెయ్యలేదు.

"ఓసెర్రి లచ్మీ! నాను నక్షా తొంబయి మంది కాడ తొంగున్నాను. తొంగున్న పెతీనంజకీ పుట్టిన పెతీ గుంటకీ నానే బాబు నేటే. అదెలా గొర్దీ. అలాగే ఈడూనూ. నువ్వు... పోయిన నీ మొగుడు కాడ తొంగున్నావు. నా కాడా తొంగున్నావు. సాదూగాడి కాడా తొంగున్నావు. కాళ్ళు లేని ఆ రాములుగాడి కాడా తొంగున్నావు. ఎవలు తొంగోమన్నారు? గాలికి బుట్టిన ఎదవలు గాలికే పోతారు. నీ యాక లేదో నువ్వు కాసుకో." నీతిబోధ చేశాడు పకీరు.

"మొగుడు సచ్చిన మూడ్రోజుల నాడే కట్టాలు తీరుత్తామని కనికారం చూపించి కక్కుర్తి పడి మోసం చేసిన నా కొడుకుల్లో నువ్వొ ఒకడివిరా పకీరు సచ్చినోడా, మర్చిపోనావేటి?" బాధ నణచుకొని అంది లచ్మి.

దానికేం మాట్లాడలేదు పకీరుగాడు.

"ఇచ్చీ. రొట్టిచ్చీ. గుడ్డిగాడి దగ్గర నాను కొట్టేద్దామనుకుంటే నువ్వు తయారయ్యావేటే." విసురుగా లాగాడు. సగం రొట్టె ముక్క పకీరుగాడి చేతిలోకి వచ్చేసింది.

"ఇది నాను ఉంచేసుకుంటాను. ఒగ్గేరా." సగం రొట్టె ముక్క వేపు చూస్తూ అన్నది లచ్మి.

"రేత్రి కొత్తావా". లచ్మి మాట్లాడలేదు. వాడు దగుల్బాజీ నవ్వు నవ్వాడు. లచ్మి వాడి వేపు కాని, వాడి నవ్వు వేపుగాని చూడలేదు. చేతిలో రొట్టెముక్కని నోట్లో పెట్టుకుని సగం కొరికి మిగతా సగం పిల్లలకు పెడదామని ముందుకి నడిచింది.

అంతట్లో ఉయ్యాల్లో పిల్ల ఏడుపు వినబడింది. దాన్ని వళ్ళోకి తీసి, పాలుతాగిస్తూ కొడుకుని, కూతుర్ని లేపి రొట్టెముక్కని పెట్టింది.

"మరి నేదేటే" పెద్ద గుంటడు అడిగాడు.

"నేదురా" అని ఇంకేదో చెప్పబోయి ఆగిపోయి రోడ్డు వేపు చూసింది లచ్మి.

గుడిసెల పక్క నించి వయ్యారంగా నడుచుకొస్తున్న పైడమ్మ వేపు చూసింది లచ్మి.

వెల్తురింకా పోలేదు. మేఘాల చాటునుంచి నిటారుగా పడుతున్న సూర్యుడు ఎర్రగా, ఎర్రెర్రగా పురిటి కందులా ఉన్నాడు. ఒక పక్క ఆకాశం గర్భస్రావం అయినట్టుగా అసహ్యంగా ఉంది. ఇంకో పక్క కమ్ముకొస్తున్న చీకటి,దరిద్రంలా ఉంది.

పైడమ్మ బాగోదు. పైడమ్మ పొట్టిగా గిడసలా ఉంటుంది. అదిప్పుడు రంగు వెలసి పోయిన సిల్కు చీరతోను, చిరుగులు కనపడని జాకెట్టుతోనూ ఉంది. దాని జుట్టు పొడవుగా ఉండదు. అయినా జడ వేసుకుని ప్లాస్టిక్ పువ్వుని తగిలించుకుంది. ముఖానికి పెట్టుకున్న కుంకుమ బొట్టు సగం చెరిగిపోయింది. పైడమ్మ పుష్టిగా ఉంది. అందం లేకపోయినా, వయసే అందంగా ఉంది. పకీరుగాడి మాటల్లో చెప్పుకోవాలంటే - "దానందం కుండల్లాంటి గుండెల్లోనూ, డేయిసాల్లాంటి పిర్రల్లోనూ ఉంది" అందుకే పైడమ్మ దగ్గరరోజంతా డబ్బు ల్లేకపోయినా, రాత్రయాసరికి రూపాయి డబ్బులుంటాయి.

పైడమ్మ చేతిలో విస్తరాకు పొట్లం ఉంది. అది నడుచుకుని వస్తూ గుడ్డి సాదూని, పకీరుని పలకరించి తన గుడిసె దగ్గర కొచ్చి నులక మంచమ్మీద కూర్చోబోయింది.

ఆ సమయంలో లచ్మి పరుగు లాంటి నడకతో పైడమ్మ దగ్గర కెళ్ళి దాని చేతిలో వున్న పొట్లాన్ని లాక్కుంది.

"ఏటే నచ్మీ, గుంటల దగ్గర దొబ్బిడానికి సిగ్గనేదూ" అని వెనక్కి తిరిగింది లచ్మి. పైడమ్మ ముందుకి అడుగేసి లచ్మికి అడ్డంగా నిలబడింది.

"పొట్లాం మర్యాద గిచ్చి, అది నాను కొనుక్కుంది. గుంటలకాడ నా నేం నాక్కోనేదు." లచ్మి చేతిలో పొట్లాన్ని లాక్కుంది పైడమ్మ.

"నా పిల్ల లెల్లి కాడకి నువ్వెందు కెళ్ళావ్, నంజా! మర్యాద గిచ్చి, లేకపోతే పేగులు పుటుక్కున కొరికేత్తాను" కోపంగన్నాది లచ్మి.

"కొరుకు సూత్తాను. పళ్ళు పులుపెక్కి పోయాయి గావాల. ఒళ్లుసలు పెక్కి పోనాది గావాల. ఒహో హో. నా నివ్వను. ఎలా నాక్కుంటావో నాక్కో సూత్తాను." పైడమ్మ గీరగా అంది.

"ఎలా నాక్కుంటానా ఇలాగే" పైడమ్మ చేతిని గట్టిగా పట్టి లాగింది లచ్మి. పైడమ్మ వదల్లేదు. పైడమ్మ చేతుల్ని కరవడానికి ప్రయత్నం చేసింది.

లచ్మికీ రెండ్రోజులున్నించి అసలు తిండి లేకపోవడం వలన నీరసంగా ప్రాణాలు కడట్టుకుపోయినట్టుగా ఉన్నాయి. అయినా తిండిని దక్కించుకోవాలనే ప్రయత్నంలో నరంలా సాగుతోంది.

పైడమ్మ పుష్టిగా బలంగా ఉండటంవలన అది గబుక్కున లచ్మిని ముందుకు తోసేసి గుడిసె ఎనక్కి పారిపోయింది.

"ఆగే నంజా! పైసాకు పడుకునే నంజకి పిల్ల లాకలి ఏటి తెలుత్తాదే. గుంటలు సంపాదించుకున్న తిండది. దిక్కుమాలిన సావు సస్తావ్. అమ్మోరు తల్లీ దయసూడే. ఆ నంజకి దిపవెట్టేయ్. ఆ నంజని వల్లకాట్లో కలిపేయ్. నంజా. నా పిల్లలుసురు, నా ఉసురు తగుల్తాదే. కడుపు కూడు కొట్టేసిన నంజకి కడుపు తీపి తెలుస్తాదేటి." నోటి కొచ్చినట్లుగా తిడుతూ పరుగెడుతోంది లచ్మి.

"ఏటన్నావ్. అవునే, నేనే ఏసాలేసాను. నేనేనే నానా జాతుల పేటకాడా నేనే. అంబటి సత్రం కాడా నేనే. యాసన్నారాయణ గుట్టల్లోనూ నేనే. అయోధ్య మైదానం గుడిసెల్లోనూ నేనే. ముగ్గురు గుంటలకి తండ్రెవరో సెప్పు. ఒక్కో పిండానికి పదేసి జనాలే, సిగ్గు లేకపోతే సరి" పైడమ్మ లచ్మి జుత్తుపట్టుకుని గుంజి వెనక్కి తోసేసింది. లచ్మి దబ్బున కింద పడిపోయింది. పడిపోయిన లచ్మి విసురుగా ఏడుస్తూ లేచింది.

"హోరి పకీరు! ఓరి గుడ్డి నాకొడకా! ఓరి కుంటెదవా! నా పిల్లలకు తండ్రులెవరో సెప్పండ్రా. దిక్కుమాలిన నా కొడుకల్లారా! తాగీసీ దులపరించేసికోడం కాదర్రా. సెప్పండ్రా. నన్నన్నాయం సేసిన గాడిద కొడుకల్లారా! సెప్పండ్రా" గుడ్డి సాదూ గాడి వేపు,పకీరుగాడి వేపు చూస్తూ అరిచింది లచ్మి.

ఈ దృశ్యాన్ని చూడలేక సూర్యుడు తల వంచుకుని వెళ్ళిపోయాడు. మున్సిపాలిటీ వాళ్ళ లైట్ల వెలుతురు వూరిలోని పాపాన్ని కప్పి పుచ్చడానికి ప్రయత్నం చేస్తోంది. ఆ సమయంలో అక్కడికి చాలా మంది ముష్టి లోకం వచ్చి చేరింది. ఆ రగడని వేడుకగా చూస్తున్నారు.

లచ్మి అడిగిన ప్రశ్నకు జవాబు ఎవరూ చెప్పలేదు. ఇంతట్లో దెబ్బలాటకు, తిట్ల శబ్దానికి లేచిన లచ్మి పిల్లలు పరుగు పరుగున వచ్చి "మాదీ అన్నం, ఇచ్చియ్యే" అని పైడమ్మ మీద పడి లాక్కోడానికి ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళను తోసేసింది పైడమ్మ. ఆ పిల్లలిద్దరూ దబేలున కింద పడిపోయి లేచి బోరున ఏడుస్తున్నారు.

"నా పిల్లల్ని తొయ్యడానికి నీ కెన్ని గుండెలే..." అని లచ్మి పైడమ్మ మీద పడింది. పైడమ్మను ఇష్టమొచ్చినట్టుగా కొట్టి, పిడిగుద్దులు గుద్ది నేల మీద పడదోసి, అది లేచే లోపుగానే దాని చేతిలోంచి అన్నం పొట్లాన్ని నేర్పరితనంగా లాక్కుని ఇద్దరి పిల్లల్నీ ఈడ్చుకుని వచ్చి లైటు స్తంభం కిందే కూర్చోబెట్టి వాళ్ళ చేతిలో ఆ పొట్లాన్ని పెట్టి మళ్ళీ పైడమ్మ దగ్గర కెళ్ళింది.

పిల్లలిద్దరూ ఆ పొట్లాన్ని విప్పారు. పొట్లాలలో అన్నం పచ్చగా ఉంది. పులుసు కూర అక్కడక్కడ ములక్కాడలు, కలిసిపోయిన మజ్జిగతో అది నోరూరించే వాసన వేస్తోంది. ఇద్దరూ ముద్దలు తీసుకుని నోట్లో పెట్టుకున్నారు.

సరిగ్గా ఆ సమయంలో సర్రమని పరుగెత్తు కొచ్చిన పైడమ్మ గెద్దలా దాన్ని ముందుకు లాగేసింది. ఆ విసురుకు విస్తరాకు చిరిగిపోయింది. ఆ అన్నమంతా మట్టిలో పడిపోయింది. పిల్లలిద్దరూ ఆ మట్టిలో కలిసిపోయిన అన్నాన్నే ముద్దలు చేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు.

"సూసినార్రా! పిల్లలు తింటున్న నోటికాడ కూడుని ఎలా లాగేసిందో. నా పిల్లల కడుపు కొట్టావు. నీ కడుపూ అనాగే ఎవడో కొడతాడే, ఛీ..." ఏడుస్తూ పిల్లల దగ్గరకొచ్చి నేల మీద అన్నాన్ని ఏరబోయింది లచ్మి. కానీ మెతుకులన్నీ మట్టిలో కల్సి మట్టిగడ్డల్లా కనిపిస్తున్నాయి. ఆ మట్టి గడ్డల్నే ఏరింది. చిరిగిపోయిన విస్తరాకులో వెయ్యటానికి ప్రయత్నించింది.

కానీ వీలుపడలేదు. అలాగే ఆ మట్టి మెతుకులన్నిటినీ ఏరి విస్తరాకులో పెట్టి కుండ దగ్గరకెళ్ళి గ్లాసుతో నీళ్ళు తీసి ఆ అన్నాన్ని కడిగి, నీటి నంతటినీ పిండి, ఆ తడితడి మెతుకుల్ని వాళ్ళిద్దరికి ముద్దలుగా చేసి తినిపిస్తోంది. తినిపిస్తూ పైడమ్మను తిడుతోంది. తన దిక్కుమాలిన స్థితిని తల్చుకుని

ఏడుస్తోంది. ఆ ముష్టి గూడెంలో ఉన్న వాళ్ళందర్నీ పేరు పేరునా తిట్టి ఏడుస్తోంది.

ఆ గూడెంలో జనం ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. లక్ష్మి నెవరూ పట్టించుకోలేదు.

సమయం ఎంతయిందో తెలీదు. రోడ్డుమీద మనుషుల అలజడి తగ్గింది. ఆకలి తీరని పిల్లలు చాలాసేపు తల్లిని "అమ్మా... ఆకలే... ఆకలేస్తోందే" అని అడిగి అడిగి సొమ్మసిల్లి పడిపోయారు. ఎప్పుడు లేచిందో వుయ్యాల్లో పిల్ల ఏడుస్తోంది. నరాలన్నిటినీ కూడదీసుకుని ఏడుస్తోంది. ఆ పిల్లని తియ్యలేదు లచ్మి. అలా బెక్కుతూ, బెక్కుతూ ఏడవడం లచ్మికి వినబడుతోంది.

లచ్మి ఒక్కసారి లేచింది. గబుక్కున గోడ దగ్గరి కెళ్ళి తల బాదుకోవడం ప్రారంభించింది. ఆమె నుదురు చిట్లి కారుతున్న రక్తం రక్తంలా లేదు. జుత్తు పీక్కుని ఆ ముష్టిలోకం అంతా కదిలిపోయేట్లుగా ఏడ్చింది. దేవుడనేవాడుంటే వాడు కరిగి కన్నీరై పోయేటట్లుగా ఏడ్చింది. కడుపులో సమ్మెట పోటులా భయంకరంగా బాధపెట్టే ఆకలి బాధను భరించలేక లచ్మి చాలాసేపు నేలమీద పొర్లి పొర్లి ఏడ్చింది.

ఆ తర్వాత -

కొంతసేపటికి లచ్మి లేచి నిలబడింది. ఉయ్యాల్లోని పసికందుని రెండు చేతుల్లోకి తీసుకుంది. గబగబా ముందుకి నడిచింది. గుడిసెల ముందు అందరూ నిద్రపోతున్నారు. ఎక్కడనుంచో మనుషుల మాటలు చిన్నగా వినబడుతున్నాయి.

గెడిసెలు దాటి, రైల్వే స్టేషన్ రోడ్డు దాటి ముందుకు నడిచింది. అక్కడ పార్కు పక్కన మున్సిపాలిటీ లైటు కింద నలుగురు మనుషులు పులిజూదం ఆడుతున్నారు. అక్కడకు వెళ్ళి నిలబడింది లక్ష్మి.

ఆ అడుగుల చప్పుడికి ఆ నలుగురూ తల తిప్పి చూశారు.

"ఒచ్చావా...నేను సెబితే ... ఇన్నావు...కావు... ఇప్పుడైనా తెల్సుకున్నావా..." కుంటి రావులు కర్ర సర్దుకుని లేచాడు.

"ఎంతిస్తావు" లచ్మి అడిగింది.

"మొదట్నించీ నా మాట పాతికే.." లచ్మి ఏదో చెప్పబోయింది. ఎందువలనో ఆగిపోయింది.

"తీసుకోరా" కుంటి రావులు పక్కనున్న ఇంకొకడు లేచి లచ్మి చేతిలో ఉన్న పిల్లని అందుకున్నాడు. కుంటి రావులు రెండు పదులు, ఒక ఐదు తీసి లచ్మి చేతిలో పెట్టాడు.

"నీ పిల్లకూ, నీకూ రుణం తీరిపోనాది... అరదవైందా?"

లచ్మి తలూపింది. ముందుకి ఒకడుగు వేసింది. అడుగు పడలేదు. ఒక్కసారి పిల్లముఖంవేపు చూసి గబగబా ముందుకి నడిచింది.

ఆ రాత్రి లచ్మి జీవితంలో మొట్టమొదటిసారిగా కడుపు నిండా అన్నం తిన్నాది.

*ఆంధ్రప్రభ వీక్లీ, 29-2-1984*

*